# అడ్డాకుల్లో విడాకులు

విరించి విరిచికట్టి పారేశాడు వాళ్లిద్దర్నీ యీ లోకంలో విదలింపుల్తో, అదలింపుల్తో అన్యోన్యంగా కాలం గడపమని. పెద్దలంతా "అనయోః దంపత్యోః అన్యోన్యం ప్రీతి రస్తు" అని దీవించి రామాన్ని, రాజ్యాన్ని ఒకటిగా చేసి తమ బాధ్యతను వదిలించుకున్నారు. రామం - రాజ్యం — పేర్లదాకా బాగానే వుంది కాని "రామరాజ్యం" మట్టుకు కాలేకపోయింది. దగ్గర సంబంధాలు కలుపుకుంటే ఆదరాభిమానాలు అభివృద్ధి పొందుతాయని తల్లీ దండ్రీ బలవంతంగా మేనరికం చేసేరు. నాజూకు నాగరికతా తక్కువంటూ ఎప్పుడూ ధుమధుమలాడుతూనే సంసారాన్ని నెట్టుకొస్తున్నాడు రామం. పరి

## చాగంటి విశ్వనాధరావు

శుభ్రం లేదంటూనో, ఎప్పుడూ జిడ్డోడుతూ వుంటావనో సాధిస్తూవుంటాడు రాజ్యాన్ని. అతను ఎంత అసహ్యించుకున్నా రాజ్యం స్త్రీసహజమయిన ఓర్పుతో కాలాన్ని గడుపుకొస్తూంది. ఎంత సహజమైనా రోజూ వాడుకొంటూవుంటే ఎంతకాలమొస్తుంది! తనూ యింతో అంతో స్కూలు ఫైనలుదాకా చదువుకుంది. లోకంలో మంచీ చెడూ చూస్తూంది. పిల్లల్తో, పసిపాపల్తో, భర్త ఆఫీసువేళ తొమ్మిదిగంటలకే అమర్చవలసే వంటల్తో, నిత్యం నిగనిగలాడుతూ పౌడర్ల మెరుగుల్లో, అత్తర్ల ఘుమఘుమల్లో, యిస్త్రీ మడతల్లో సినిమా స్టార్ లాగ నిత్యం అవుపడాలంటే సాధ్యమా? అన్నీ తెలుసుండీ యీ మొగాళ్లు ఆమాత్రం గుర్తించుకోకపోతే ఎలాగ అనుకుంటుంది.

ఆదివారం తీరుబాటుగా కూర్చున్నాడు, సిగరెట్టుమీద సిగరెట్టు తగలేస్తూ. ప్రక్కనే కూచుని బియ్యం బాగుచేసుకుంటూన్న రాజ్యం; "ఆ పొగని కొస్త అటు వొదలకూడదూ? రోజురోజుకీ ఎక్కువయిపోతున్నాయి పాడు సిగరెట్లు" అంది.

"ఇదుగో అస్తమానం ఆ సణుగుడే వద్దన్నాను. నా యిల్లూ నా డబ్బూను! నా యిష్టమొచ్చినట్టూ తగలెట్టుకుంటాను. నికెందుకూ? నువ్వవతల వరండాలో కూచోకూడదూ అంత పొగకే కందిపోయే సుకుమారివైతే?"

"ఎప్పుడు చూచినా చిర్రు బుర్రు మంటూనే వుంటారేమండి; సరదాగా ఓ మాట మంతీ లేకుండాను. ఇప్పుడు నా సణుగు డేముంది? సంపాదనలో సగం సిగరెట్లకే ఖర్చవుతూంది. ఇంట్లో చూస్తే బియ్యం నిండుకున్నాయి. పాపకి పాలడబ్బా మాట ఎన్నిసార్లు చెప్పినా వినిపించుకోరు. ఎలా వేగడం మీతో?"

"మీ బాబుగారి సంపాదన నేనేమీ ఖర్చుపెట్టడం లేదులే! రోజూ ఏదో ఒకటి నిండుకుంటూనే వుంటుంది. వెధవసంసారం నే చెయ్యలేను. ఆదివారం కదా అని యింట్లో కాస్సేపు కూచుందామంటే యేదో ఓ పోరు!" అని విసుక్కుంటూ చరచరా వెళిపోయేడు ఎక్కడికో?

ఇంతలో చంటిది వుయ్యాల్లోంచి లేచి ఏడవడం మొదలుపెట్టింది. "పాలడబ్బా తెమ్మంటే వినిపించుకోకుండా వెళ్లారే! యీ పిల్లల్తో ఎలా వెళ్లదియ్యడం?" అనుకుంటూ పిల్లని సముదాయిస్తూంది. ★

## ★ చదరంగము మొదలైనవి ★

పోకూడదు. పండపోతున్న ఇతరుల పావులను చంపటము అతి సంతోషకరమైన విషయము, చెప్పకోతగిన ప్రజ్ఞ. ఒక పందెముతో రెండు మూడు కాయలను చంపటము ప్రజ్ఞావిశేషము. ఈ ఆటలో పందెముల పేర్లన్నీ ఉర్దూభాషలో ఉన్నాయి. పచ్చీస్, తీస్, దస్, చౌదా, బారా, అన్న పందేలతో పావులను నడుపుతారు. అప్పుడప్పుడు రెండు పచ్చీసులుగాని రెండు తీసులుగాని పడుతూఉంటాయి. వాటిని దో పచ్చీసనీ దో తీసనీ అంటారు. ఈ ఆటలో తప్ప మరే ఇతరవిధములైన క్రీడలలోను ఉర్దూపదాలు లేవు. భాష రాకపోయినా పందేల పేర్లు నేర్చుకొని ఆడి గెలిచి ఆనందిస్తూ ఉంటారు. ఈ ఆటవల్ల లౌకికజ్ఞానము అభివృద్ధి చెందుతుందని ఒక నమ్మకము.

పులి జూదములో మూడు పులులు, పదిహేను మేకలు. ఇది ఇద్దరు ఆడే ఆట. పులులకు మూడింటికీ స్థలనిర్దేశ్యము ముందే అవుతుంది. ఇది మొదటి ఎత్తు. దీనిలో మార్పు ఉండదు. మేకలతో ఆడేవారు తమ వంతు ఆట వచ్చినప్పుడు ఒక్కొక్క మేకను గడిమీద పెడుతూ ఆడాలి. మూడు పులులు తలచుకొంటే పదిహేను మేకలను అవలీలగా తినివేయవచ్చు గాని, చుట్టుప్రక్కల తిరుగుతూ పులి నోటి కందకుండా మేకలు తప్పుకొని తిరుగుతూ ఉంటాయి. బలవంతమైన సర్పము చలిచీమలచేత చిక్కినట్లుగా అతిసాధువులూ పిరికిజంతువులుఅయిన మేకలు గంతులువేస్తూ పులులనుకట్టివేస్తాయి. పదిహేను మేకలతో మూడు పులులను కట్టించలేమా అని అహంభావముతో బయలుదేరితే వెంటనే గర్వభంగముకూడా జరుగుతూ ఉంటుంది.

చీట్లలో, బ్రిడ్జి, రమ్మీ, బేస్తు, కుదేలుపట్లాట, మూడు ముక్కలాట, ఆతును, (వేలను) మొదలైన రకాలు చాలా ఉన్నాయి. వీటిలో బ్రిడ్జి తప్ప తక్కిన ఆటలన్నీ అందరూ ఆడుతునే ఉంటారు. బ్రిడ్జి గణితముతో కూడినది కనుక ఇతర విధములైన ఆటలవలె అందరూ ఆడరు. చీట్లాటలో చాలా మంది డబ్బుపెట్టి ఆడుతూ ఉంటారు.

ఇళ్ళలో పనిచేసుకొని పిల్లలతో వేగివేగి ఉన్న స్త్రీలకు ఈ క్రీడలవల్ల మానసికముగా విశ్రాంతి కలుగుతుంది. గృహకల్లోలాలతో విసిగిపోయిన ప్రాణానికి హాయిని గొలుపగలిగినవి క్రీడలే. ప్రతిదినమూ విరామ సమయములో కనీసము ఒక గంటసేపు వీటిలో మనసును జొరనిచ్చినట్లయితే గృహిణికి గృహజీవనము నిస్సారముగా తోచదు. అట్లా అని వేళగాని వేళలలో వ్యసనముగా క్రీడలతో కాలక్షేపము చేసినట్లయితే దైనందిన కృత్యాలకు సమయభంగము కలుగుతుంది. తమ కేవి హితము కూర్చగలవో, వాటి పరిమితు లెంతవరకో తెలిసికొంటే జీవితాదర్శము చేతి కందినట్లే. ★

వీధిలో పాలవాడు "అమ్మా ఆదివారం. బాబుగారింట్లో వుంటారని ఒచ్చేను లెక్క యిప్పించండం"టూ తయారయేడు. రోషం తోటి, అవమానంతోటి రాజ్యం ముఖం కందగడ్డలాగ జేవురించింది. "ఏమో మీ బాబుగారూ, నువ్వూ ఏ గంగలో దిగుతారో నాకేం తెలీదు. దిక్కుమాలిన సంసారం" అందామనుకుంది. కాని కొంచెం సర్దాయించి "ఆయ నిప్పుడే వీధిలోకి వెళ్లేరు రామన్నా. రేపు నే నడిగి వుంచుతాను. ఇప్పటికి దయచేసి వెళ్లు నాయనా" అంది. ఏ కళనున్నాడో కాని "అలాగేనండమ్మా" అంటూ దాటిపట్టేడు.

"అక్కా విడాకులచట్టం పేసయిందిటే!" అంటూ శంకరం ఒచ్చేడు పేపరు పట్టుకుని.

"అవన్నీ నాకెందుకురా నీ ముఖం. స్వకీయాల్తోనే వుక్కిరిబిక్కిరౌతూ వుంటే రాజకీయాలు కూడాను! పాపని ఓసారి తియ్యి. పాలు నీళ్లు మరగబెట్టి పట్టుకొస్తాను" అంటూ వంటింట్లో కెళ్లింది.

* * *

"శశి ఏదీ?" అన్నాడు రాత్రి పదిగంటలకు యిల్లుచేరుకున్న రామం.

"మీకో కాని అన్నం తిన్నంటూ యిప్పటిదాకా చూసిచూసి యిప్పుడే నిద్రపోయింది."

"ఏకోవిధంగా బుజ్జగించి తినిపించాలి కాని యిప్పుడు పడౌతూంది కదా యిప్పటిదాకా దాన్ని పస్తుపడుకో బెట్టేవా? ముగ్గురు పిల్లల్ని కన్నావే కాని వాళ్లనెలా పెంచాలో యీసరికి తెలీదు."

"మొదట్నుంచీ మీరు దాని కలా అలవాటుచేసేరు యిప్పుడు - కొత్తగా అర్ధరాత్రి దాకా కొంపకి రాకుండా తిరగడం మొదలుపెట్టేరు. మీ చేత యిది మాన్పగలిగేనా, దానిచేత అది మాన్పగలగడానికి? మీ కూతురది. మధ్య నా తప్పేముంది?"

"మాటకి మాట తెగులు! నువ్వు నన్నింట్లో వుండనిస్తేనా వుండడానికి! అహరహం పోరేనాయె! యిహ నీ భారతం కట్టిపెట్టి నాకు మెతుకులు వడ్డించు."

శశిని లేవదీసి తనతోబాటు భోజనానికి కూర్చోబెట్టుకున్నాడు. రాజ్యం వడ్డిస్తూ వుంది.

"అబ్బ బ్బబ్బ! నాకీ నరకం ఎన్నాళ్ళురా బాబూ! నాలికమీద మొక్కలు మొలుస్తున్నాయే నీ వంటతోను! కూరలో ఉప్పులేదు. అన్నంనిండా బెడ్డలు. పులుసన్న పేరేకాని కాలకూటవిషం నయం దీనికన్న. ఇలా ఎన్నాళ్లు వేగడం నీతోను?"

"బియ్యం నిండుకుంటున్నాయని నాలు రోజులనుండి మీకు జ్ఞాపకం చేస్తూనే వున్నాను. డబ్బా దులిపి వున్న కాడికి బాగుచేసి వండేనండీ. ప్రతిదానికీ గోరంతది కొండంతచేసి నన్ను నిందించడమే పని పెట్టుకు కూర్చుంటే నేనేం చెయ్యడం! మీ కంత యిష్టం లేకపోతేమట్టుకు యిప్పుడు నే నెక్కడికి పోగలను. అగ్నిసాక్షిగా మూడుముళ్ళూ వేసి వివాహ మాడేరు. ఇప్పుడు తప్పుకుంటే తప్పుతుందా? నే నుబ్రతికున్నంతకాలం తప్పదు." అంటూ కంట తడిపెట్టుకుని తలుపు చాటుకు పోయింది.

"ఆహా! అదా నీ భరోసా? యివేమీ నాయనమ్మరోజులు, అమ్మమ్మ రోజులు కావే తప్పకపోడానికి! చూదువుగాని నా తడాఖా" అంటూ కంచంలో నీళ్ళు దిమ్మరించి లేచిపోయేడు.

* * *


"ఒరే శంకరం తపాలాబంట్రోతు నా చేత సంతకం పెట్టించుకొని కవరుయిచ్చి వెళ్లేడు. నేను కోర్టుకు హాజరవాలిట! తక్కిన విషయాలు ఏమంత సరిగా తెలియలేదు. నువ్వోసారి చూడు." అంటూ శంకరానికో కవరిచ్చింది. అతను అది సాంతం చదివి "అక్కోయ్! మొదటికేసు మందేనే!" అని గావుకేక పెట్టాడు.

"కేసేమిట్రా? ప్రతిదానికి వెటకారాలు నువ్వూను. వేళాపాళా లేదట్రా. సరిగా చెప్పు నన్నాట్టే విసిగించక."

"అయితే విను. విడాకుల చట్టం పేసయింది కదే! బావ నీకు విడాకు లిస్తాట్ట. అందుకని అతను కోర్టువారిని కోరేడు. కేసు విచారణరోజున మనమంతా కోర్టుకు వెళ్లాలి. ఏయే కారణాలవల్ల బావ నీకు విడాకు లిస్తాడో వాటిని బలపర్చే సాక్షులు, మీ యిద్దరితరఫున వాదించడానికి ప్లీడర్లు, మొదలుగాగల కోర్టుపక్షులన్నీ అక్కడ చేరుతాయి..."

"అదిగోరా మీ బావగారు వచ్చేరు కాబోలు. వెళ్ళి వీధితలుపు తియ్యి.'

"తీస్తా కాని, నువ్వు అనవసరంగా ఏడుపులు, పెడబొబ్బలు పెట్టకుండా నే చెప్పినట్టు చెయ్యి. ఇప్పు డసలు నీకీ వుత్తరంసంగతే తెలియనట్టు నటించాలి. బావ ఏం చెప్పినా నువ్వు మామూలుగా నే మాట్లాడు. మచ్చుకేనా నీ ముఖంలో విచారచిహ్నం అవుపించకూడదు. రోజూకంటె సంతోషంగాను, చలాకీగాను వుండాలి జాగ్రత్త!"



# ★ అడ్డాకుల్లో విడాకులు ★

అంటూ శంకరం క్రిందకి వెళ్ళాక తలుపు తియ్యడానికి. రాజ్యం వచ్చే వాళ్ళెవరా అని మేడమెట్లవేపు కళ్లప్పగించి చూస్తూ దిగులుగా కూచుంది.

గబగబా రామం మేడమీదికే వచ్చాడు. నాలుగు రోజులనుండి అతనిలో చాలా మార్పు కనపడుతూంది. రాజ్యంతో అస్తమానం తగువులాడ్డం, చిరాకుపడడం మానీసేడు. ఇంట్లో ఉన్న కొద్దికాలం ఆమెతో శాంతం మూర్తీభవించినట్లు కాలం గడుపుతున్నాడు. కాని మనసులో లావా మరుగుతూనే వుంది. కాలకూటవిషాన్ని షరబత్తులాగ త్రాగించే విధానం ఎలాగా అని ఆలోచిస్తూ తియ్యని మాటల్తో ఆమెవల్లనే అంగీకారాన్ని పొందాలని, ఆమె నెలాగైనా ఒప్పించి తప్పించుకుందామనీ అతని ఆలోచన.

టేబిలుమీద సిగరెట్టు టిన్నులో ఓ సిగరెట్టు తీసి వెలిగిస్తూ "ఏం రాజ్యం అలా వున్నావు?" అన్నాడు.

"అబ్బే! ఏం లేదు. ఎలా వున్నాను? బడి విడిచిపెట్టినా పిల్లలింకా రాలేదేమా అని ఆలోచిస్తున్నాను. ఇంతలో మీరొచ్చేరు! వాళ్ళే అనుకున్నాను. ఇవాళింత వేగం యిల్లు జ్ఞాపకం వచ్చిందేమిటి కథ?"

"కథే మరి. నీతో వో ముఖ్య విషయం మాట్లాడదల్చుకున్నాను. చాలా శాంతంగా వినాలి. పరిస్థితులన్నీ ఒక్కమారుగా తారుమారైతే ఆ పరిణామాన్ని నువ్వు భరించలేవని సంగతంతా నెమ్మదిగా బోధపరుద్దామనుకుంటున్నాను. నువ్వనవసరంగా ఉక్కిరిబిక్కిరై భయపడకూ!..."

"అక్కా నీకొచ్చిన భయం బావకేం లేదు లేవే" అన్నాడు పాపాయి నెత్తుకుని పచారు చేస్తున్న శంకరం.

"అబ్బ! వుండవోయ్. ఇది వెటకారాలకి సమయం కాదు. చాలా సీరియస్‌గా వినాలి. పోనీ ఆ భయంతాలూకు గాలి నీకు తగుల్తుందిలే."

"నువ్వు వుక్కిపోయి నీళ్లు (చెమట) కారిపోతూవుంటే మేం చూస్తూ వూరుకొంటామా? ఆ గాలి నీకు మాత్రం తగలదూ? ఏదో సరదాగా వున్నారనుకొని వచ్చేనంతే. మీరూ మీరూ మాట్లాడుకొంటూవుంటే మధ్య నేనెందుకు?" అని రాజ్యంవేపు 'నే వెళిపోతున్నాను, నువ్వు మట్టుకు చాలా జాగ్రత్తగా వుండాలిసుమా' అన్నట్టు చూసి క్రిందకి వెళిపోతాడు.

"మనం యిన్నాళ్ళబట్టి కాపరం చేస్తున్నాం కాని ఒకరి నొకరం అర్థం చేసుకోలేకపోయేము. ఆ వెలితి మన ముందు జీవితానికి అవరోధంగానే పరిణమిస్తూ వుంది. ఇలా ఎడముఖాల్తోటి పెడబొబ్బల్తోటి ఎన్నాళ్లీదురీదగలం యీ సంసారాన్ని? అలా చెయ్యడం నిన్ను బాధపెట్టడం, నా అంతరాత్మని చంపుకోవడం! కాబట్టి నేనో నిశ్చయాని కొచ్చేను. నీకూ అట్టే బాధవుండదు, నా ప్రాణానికీ హాయిగా వుంటుంది, నే నిప్పుడు చెయ్యబోయే ఏర్పాట్లవల్ల. నెలనెలా నీకు కొంత డబ్బు కేటాయించబడుతూ వుంటుంది. నీ యిష్టమొచ్చినట్టూ నీ కర్చులు నువ్వు పెట్టుకుంటూ వుండవచ్చును. ఒకళ్ల అడ్డేమీ వుండదు. బాగా ఆలోచించుకో!" అని రాజ్యం ముఖం పరిశీలనగా చూశాడు రామం.

బిలబిలా పరిగెట్టుకొంటూ శశీ అమ్మాజీ లోనికి వచ్చారు. తండ్రిని చూచి అమ్మాజీ కాస్త తగ్గి అమ్మఒళ్లో దాక్కుంది. శశి మట్టుకు తండ్రిదగ్గర కూచుంటూ "నాన్నా యివాళేం, మా బళ్లో మాంచి గారడీ చూసేం నాన్నా! వాడేం...వాడి బుగ్గమీసాలు, తట్టతలపాగా చూట్టానికి భయంగానే వున్నాడు కాని, మా బాగాచేసేడు నాన్నా. మరేం రెండుకోళ్ల బుట్టల్ని మా అందరికీ చూపించి వేరే వేరే పెట్టేడు. అందులో ఒకదాంట్లో ఓ పుంజుని, పెట్టని, నాల్గు పిల్లల్ని పెట్టేడు. కాని రెండోబుట్ట కాళీగానే వుంది. అదేదో చిన్న కర్రలా వుంది నాన్నా! దాంతో రెండు బుట్టల మీదా మూడుసార్లు కొట్టి రెండుబుట్టలూ పైకెత్తేడూ.. ఏముంది? ఆశ్చర్యం! ఎలా ఒచ్చేయో కాని ఆ బుట్టలోని పుంజూ రెండు పిల్లలూ రెండో బుట్టలోకి ఒచ్చేయి! మొదటి బుట్టలో పెట్ట రెండు పిల్లలూ మాత్రమే వున్నాయి. దాన్లోవి దీన్లో కెలా ఒచ్చేయి నాన్నా?" అంది.

"అదంతా గారడీవాడి మాయమ్మా! మీరు క్రిందికివెళ్లి మామయ్యను కథలు చెప్పమనండి" అంటూ రాజ్యం పిల్లల్ని క్రిందికి పంపింది.

"అంతా ఆడపిల్లలే కదా, ఒక్కడేనా మొగపిల్లవాడుంటే.. " అన్నాడు రామం, అందుకు కారణం అంతా ఆమే అయినట్టు చూస్తూ.

"అవును దానికీ తప్పంతా నాదే!..."

"అని వేరేచెప్పాలా? మరో పెళ్లి చేసుకొనే నా యింటికి వంశాంకురాన్ని పొందాలి."

"అదేమిటండీ అలా మాట్లాడతారు? భగవంతు డిచ్చినదానికి మనమేం చేస్తాం? లోకంలో ఎక్కడయినా భార్యకి పిల్లలు కలగక ఆమె గొడ్రాలైతే, పిల్లలకోసం మళ్లీ పెళ్లిచేసుకుంటూ రెవరైనా.. అది అందం చందం. నలుగురూ హర్షించే విషయం. కాని మొగపిల్లలకోసం నిక్షేపంలాంటి సంసారాన్ని ఒదిలి మళ్లీ పెళ్లి చేసుకోబోవడం మీదే మొదటికేసులా వుంది. ఆ వొచ్చే ఆమెకూడా ఆడపిల్లల్నే కంటే?"

"నీవన్నీ లాపాయింట్లు, అవును మరి! లాయర్గింట పెరిగేవాయను, నీ తప్పేముంది! అసలు మానవతత్వ శాస్త్రజ్ఞులంతా ఏమన్నారంటే - వంశంలో తండ్రి తాతలు ఎక్కువగా ఏ సంతానాన్ని కంటే వారి పిల్లల సంతతి కూడా ఆ మాదిరిగానే వుంటుంది. తలిదండ్రుల వంశాల్లో ఏ వొక్కరి లేక యిద్దరి సాంప్రదాయమేనా అలవడవచ్చు అన్నారు. మా నాన్నకి మేమంతా మొగాళ్ళమే! మా తాతగారి సంతతిలో హెచ్చుభాగం మొగసంతతే! ఎటొచ్చీ నీ తాలూకే అంతా ఆడసంతు! మనకి నీవాళ్ళ ఛాయలే అబ్బేయి కనక యిక నీకు మొగపిల్లల్ని కనే యోగ్యత సున్నా !!"...

"కాబట్టి ఇప్పుడు నీకు విడాకులిచ్చి, ఎవళ్ళ వంశంలో అయితే అంతా మొగ సంతతి వుంటుందో ఆ చపలాక్షిని చేపట్టవచ్చు బావ! అంతే కాకుండా ఆ మనువ చోరవంశసంజాత కూడా అయి వుండాలి. లేకపోతే ఆమెగారి మొగసంతానాన్నంతనీ పోషించడానికి బావగారి జీతం చాలవద్దూ?" అన్నాడు ఏదో పనుండి గదిలోకి వచ్చినట్టు నటిస్తూ శంకరం.

"బాగుంది వరస" తీక్షణంగా చూస్తూ అన్నాడు రామం.

"బాగుండదూ మరి దినానికో పరసైతే."

"పరసలకీ, జాతర్లకీ యిదేం దేవాలయం, అమ్మవారి గుడీ అనుకున్నావా? యద్భావం తద్భవతి పోనీ అలాగే అనుకో. మీ మనసుల్లో ఎలావుంటే కార్యాలూ అలాగే జరుగుతాయి! ఎవరి కర్మ కెవరు కర్తలు?"

"అంతేలే! ... ఎవరి కర్మ కెవరు కర్తలూ? నువ్వుమాత్రం భావిభారత పురుష సంతతికి ఏకైక కర్తవి! ఏమిటో బావా ముగ్గురు బిడ్డల తండ్రివైకూడా నీ పిచ్చి వూహాలూ నువ్వూను"...

"ఇదిగో శంకరం నువ్వనవసరంగా నోరు జారుతున్నావు. పిచ్చి వూహాలూ, పిచ్చి వాగుడూ నీదో నాదో కోర్టులో తెల్సుకుం

దువుగాని, అందాకా ఓపికపట్టు. అనవసరపు విషయాల్లో జోక్యం చేసుకోవద్దని చెప్పడం యిది మొదటిసారి కాదని తెలుసుకో."

"ఊరుకోరా బాబూ అనవసరంగా ఆయనచేత అంతలేసి మాటలు ఎందుకు పడతావు. నువ్వీవూరు వుద్యోగప్రయత్నం మీద వొచ్చేవు. నీపని నువ్వు చూచుకోరా."

"అబ్బ! వుండవే, వో మూల కొంపలంటుకుంటూ వుంటేను! ఇష్టం లేకపోతే మొదట తెలీదు? తగుదునమ్మా అని ఎందుకు చేసుకోవాలి. నిండు జీవితాన్ని మొదలంటా నాశనం చెయ్యడానికి తనకేం హక్కుందని?" అని నిలదీశాడు బావగార్ని.

"మనిషికో మాట - ఎద్దుకో దెబ్బ. సిగ్గు లేకపోయిన తరువాత ఎన్నని ఏం ప్రయోజనం" అంటూ విసవిస వెళ్ళిపోయేడు రామం భోజనమైనా చెయ్యకుండా.

* * *

శంకరం ఎన్నివిధాలో నచ్చచెప్పేడు ప్లీడర్ని పెట్టి వాదిద్దామని. బావని మూడు చెరువుల నీళ్లు తాగిద్దామన్నాడు. "మన బాబాయి, పెదనాన్నా కూడా పేరొందిన ప్లీడర్లు మనకేం భయం లేదు, కాకిచేత కబురుచేస్తే వచ్చి వాలా"రన్నాడు. "కోర్టుల్లో మనం గెలిస్తేమట్టుకు?...యీ కోర్టులూ శాసనాలూ మనుషుల్ని శాసిస్తాయి కాని మనసుల్ని శాసించగలవా? ఎవరి చట్టాలు వారు నిర్మించుకొని, ఎవరి ప్రవర్తనని వారే విచారించుకొని, చక్కబరుచుకొని న్యాయబద్ధులవాలి" అంది రాజ్యం. అంతే కాకుండా కోర్టులో "వారు చెప్పినదేదీ నేను కాదనను. వారి వాదమంతా నిజమే కావచ్చు. వారికి ఎంత కష్టము కలుగకపోతే యిలాంటి పనికి ఎందుకు సిద్ధపడతారు? వారి మనస్సు యింతగా నొప్పికలిగి వికలమైనతరువాత వారిని చట్టబద్ధుల్ని చేస్తేమాత్రం సంసారంలో సామరస్యం సమకూడుతుందా? కాబట్టి కోర్టువారి తీర్పు ఏ తీరుగా వున్నా నాకు సమ్మతమే!" అని చెప్పి కూర్చుంది.

కాని రామం ముఖాన కత్తివేటుకేనా నెత్తురుచుక్క లేదు. తను కల్లోకూడా యీ సమస్య యింత సునాయాసంగా పరిష్కారమవుతుం దనుకోలేదు. రాజ్యం తన బాబాయినో, పెత్తండ్రినో అండగా తెచ్చుకొని తనని ముప్పతిప్పలూ పెట్టకుండా వదుల్తుం దనుకోలేదు. కాని ఆమె నిండు కోర్టులో తన హృదయ వైశాల్యం యింత సౌమ్యంగా ప్రదర్శించేసరికి, తనే యీ హఠాత్పరిణామానికి భరించలేక ఉక్కిరి బిక్కిరయ్యేడు! తనెప్పుడైనా ఆమె విశాలభావాల్ని కాని, ఓర్పును కాని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించేడా అని ఆత్మవిమర్శ చేసుకున్నాడు. తన కానాడు ఆమె సామాన్యురాలుగా అవుపించలేదు. ఆమె ముఖంలో ప్రకటితమవుతూన్న అసాధారణ సహన శీలాన్ని చేష్టలు దక్కి చూస్తూ కూర్చుండిపోయేడు. కోర్టు వాతావరణమే జ్ఞాపకంలే దతనికి. ఏవో అజ్ఞాతలోకాల్లో విహరిస్తూన్నట్టుంది. భర్త తనవేపే రెప్పవాల్చకుండా అంతమందిలోను తదేకదీక్షగా చూడ్డం గమనించి రాజ్యం తల వంచుకుని కొత్త పెళ్లికూతురు లాగ ముడుచుకుపోయింది.

ఇంతలో న్యాయమూర్తి సుత్తి చప్పుడైంది. రామం గజగజలాడేడు కుర్చీలో, తీర్పెలా వుంటుందోనని. బిడ్డల పోషణ కూడా సక్రమంగా జరుగలేదని ఆరోపించబడడంవల్ల ఆ పోషణభారాన్ని తండ్రే వహించవలసినదిగానున్నూ, యికమీద భార్యాపోషణార్థం ఆమె ఎక్కడవున్నా సరే తన సంపాదనలో మూడవభాగం పంపవలసినదనిన్నీ తీర్పు చెప్పబడింది. రామానికది గోరుచుట్టుపై రోకటిపోటులాగ తగిలింది.


"అయ్యో! పిల్లల్ని వదిలి ఎలావుండను" అంటూ లేవబోయింది రాజ్యం. కాని ప్రక్కనున్న శంకరం వారిస్తూ "అంతా మనమంచికే! నువ్వూరుకో" అంటూ కూర్చోపెట్టేడు. తీర్పయిపోయింది. ఎవరిళ్లకు వాళ్లు పోతున్నారు.

అక్కచేతుల్లో వున్న పాపను తీసుకొని రామాని కందించేడు శంకరం. కల్లకపటం తెలియని పసిపాప బోసినోటితో నవ్వులు విరజిమ్ముతో తండ్రిచేతుల్లో కెళ్లింది. రాజ్యం ఉన్నట్టుండి ఒక్కసారిగా కొయ్యబారిపోయింది. అంతా చుట్టూ మూగేరు. రామంకూడా హడావుడిగా అక్కడ చేరేడు. కాని ఆమె ముఖంలోకి చూసేందుకతనికి ముఖం చెల్లలేదు. తల్లి అలా పడిపోవడం చూచి క్యారుమంటూ పాప తండ్రి ఒడిలోనుంచి క్రిందికి దిగి ఆమె దగ్గరికి పాకుతూ పోయింది. రాజ్యం తేరుకుని పాపని గాఢంగా హృదయానికి హత్తుకుంటూ చుట్టూ అంతమంది మూగివుండడం చూచి సిగ్గుపడుతూ శంకరాన్ని ఆనుకొని అతనితోకూడా బయటికి నడిచిపోయింది. రామం పాపని తిరిగి అడగాలేదు. రాజ్యం యివ్వనూలేదు. కాని శంకరం యింటి తాళాలు మాత్రం బావగారికి అందిచ్చి తాను అక్కగారితో కూడా వేరే బండి ఎక్కి వెళ్లిపోయేడు. బండీ అవుపడ్డంతసేపూ తెల్లబోయి చూస్తూ నడిరోడ్డుమీద నిలబడిపోయేడు రామం!

* * *

బావగారితో సంఘర్షణ జరిగిననాటి నుండీ శంకరం వేరేగది తీసుకొని అందులో వుంటున్నాడు. నేడు అక్కగారితో కూడా అందులోనే ప్రవేశించి "అక్కా నేను బ్రతికున్నంతకాలం నీకేలోటూ రానివ్వను! యిక నా అధమాధముడిమాట కలలో కూడా తలచకుండా హాయిగావుండు" అంటూ కావలసిన సామగ్రి తేవడంకోసం బయిలుదేరేడు. "అబ్బ! అంతమాటనకురా" అంటూ గోడకు జేరగిలబడింది రాజ్యం.

కోర్టునుంచి సరాసరి హోటలుకెళ్లి ఓ కప్పు కాఫీ సేవించి మింటిలో గాలిపడగలాగా ఎగురుతూన్న ఆలోచనల్ని కూడగట్టుకుంటూయింటికివచ్చి అలవాటుచొప్పున "రాజ్యం తలుపుతియ్యి" అంటూ తలుపు కొట్టేడు. చటుక్కున అతనికి పెళ్లినాటి సంఘటన జ్ఞాపకానికొచ్చింది - మరదళ్లూ, వదినగార్లూ, యితర ముత్తయిదువులూ సమి



తెనుగుజిల్లాలకు. నైజాముకు ఏజంట్లు:
శ్రీ సీతారాం జనరల్ స్టోర్సు
బెజవాడ, సికింద్రాబాదు.

# ★ అడ్డాకుల్లో విడాకులు ★

గూడి తలుపుదగ్గర పేరు చెప్పమంటూ తనని పెట్టిన అల్లరి తంతూను. మనసంతా వికలమైపోయింది. తాళంతీసి యింటిలో ప్రవేశించేడు ఒక్కడూ. బట్టలేనా తియ్యకుండా కుర్చీలో చేరగిలబడ్డాడు.

శశి, అమ్మాజీ స్కూలునించివచ్చి, పలకలూ పుస్తకాలూ టేబిలుమీద పడేసి తండ్రివేపు చూస్తూ నిలబడ్డారు. ఆ యింట్లో అలాంటి నిశ్శబ్ద వాతావరణం చవిచూడ్డం వాళ్ళకి యిదే మొదటసారి. పాపాయి ఏడుపు కాని, వంటింట్లోంచి కమ్మని కాఫీ వాసనలు కాని లేవు. బిక్కుబిక్కుమంటూ తండ్రి దగ్గరకు పోయి "అమ్మేది నాన్నా?" అన్నారు యిద్దరూ ఒక్కసారిగా. ఇద్దర్నీ దగ్గిరా పొదివిపట్టుకున్నాడు. గొంతుకలోంచి మాటలు పైకి రాలేదు. ఏం చెప్పాలో, ఎలా చెప్పాలో తెలియలేదు. పసిపిల్లల్ని కూడా యిలా వుసురుపెట్టి తనేం బావుకోబోతున్నాడో తెలియడంలేదతనికి.

రోజులు దొర్లిపోతున్నాయి. పిల్లల్ని చూచేందుకు, హోటలునుండి భోజనం తెచ్చేందుకు పనివాడి నొకడిని కుదిర్చేడు. మనస్సిమీ బాగుండకపోవడంవల్ల ఆఫీసుకు ఓ నెల సెలవుపెట్టేడు. పనేం లేకపోవడం మూలంగా బుర్ర మరీ వేడెక్కిపోవడం మొదలయింది. సెలవు కేన్సిలు చేసుకొని మళ్ళీ పనిలో ప్రవేశించేడు. హోటలు భోజనం సహించకుండావుంది. పిల్లలు సరిగ్గా తిండి తినడం మానుకున్నారు. తనూ పిల్లలూ కూడా ఓరోజు కోరోజు నీరసించి పోతున్నారు. ఓనాడు సాంబారులో రెండు బొద్దింకపిల్లల కళేబరాలు కనపడ్డాయి. అంతకుముందు తిన్నదంతా కూడా వాంతియింది. హోటలువాణ్ణడుగుతే "అదేమప్పా! యిందవూరు శానిటరీ యినస్పెక్టరు, హెల్తాఫీసరు యీవదానే కూడు కుడిచి పూడుస్తరు! అది మీ వీడులోదానె యిరకణం. అవశ్యబా" అన్నాడు. రాజ్యం వంటతో తన నోట్లో మొక్కలు మొలుస్తున్నాయనుకున్నాడు. కాని యీ అయ్యరు భోజనంతో మహావృక్షాలే లేచేట్టున్నాయి!

అమ్మాజీ తల్లికోసం బెంగపెట్టుకున్నది కాబోలు నాలుగురోజులనుండి జ్వరం తగులుతూంది. శశికి తనవద్ద చనువు జాస్తీగా వుండడంవల్ల పరిస్థితి ఏమంత విషమించలేదు. కాని అప్పుడప్పుడూ తల్లినిగురించి చిత్రవిచిత్రమైన ప్రశ్నలు వేస్తూవుంటుంది.

ఆదివారం రామం కుర్చీలో నడుంవాల్చి పేపరు చదువుదామని తీసేడు. మంచంమీద అమ్మాజీ "అమ్మెప్పుడొస్తుంది నాన్నా? అమ్మని మనింటికి రావొద్దన్నారా?" అంటూ అడుగుతూంది. పేపర్లో పంక్తులు గ్రేండుట్రంకు ఎక్స్‌ప్రెసులాగా పరిగెడుతున్నాయి. పేపరక్కడ పడేసి అమ్మాజీ ఒళ్లు మూసేడు. సలసలా మరిగిపోతూంది. నుదుటిమీద తడిగుడ్డ మార్చి అలాగే మంచం మీద వాలిపోయేడు దిగులుగా.

ఇలాంటి అమాయకులైన పసిపాపల్ని కూడా హింసించడానికి తనకే మధికారం వుంది? సుఖం! సుఖం!! సుఖం అంటే ఏమిటి?? తానింతకుముందు రాజ్యంతో పొందలేనిదేమిటి? ఇప్పుడు ధనవంతురాలైన భార్యని తెచ్చి ఆమెద్వారా పొందబోయేదేమిటి? ఆనందమనేది డబ్బుతో కొనే వస్తువా? మనకున్న పరిధుల్లో మానసికంగా సమకూర్చుకోవాలి గాని, అందని వాటికోసం ఆరాటపడుతూ, వున్నదాన్ని పోగొట్టుకొంటే?... ..ఉభయభ్రష్టత్వం ఉపరి సన్యాసం. ధనవంతురాలైన ఇల్లాల్ని తెస్తే ..ఆమె తను చెప్పినట్టు వింటుందా? ఆమె డబ్బుకి తను దాసుడవాలి! తప్పదు. ఆమె భోగవిలాసాలకు తననో ఆటబొమ్మగా చూడవచ్చు. ఇన్నాళ్ళూ నిరంకుశత్వాన్ని అనుభవించి అందుకు అలవాటుపడ్డ తను తన భావాలకి వ్యతిరేకంగా వున్న ఆమె వాంఛల్ని నిర్లక్ష్యంచేస్తే... అప్పుడు ఆమె తనని కోర్టుకీడ్చి విడాకులిస్తే!!...

రామం కంపించిపోయేడు. అవమానంతో ముఖం కందగడ్డలాగ జేవురించింది. పాతాళానికి కృంగిపోయేడు. తల ఎత్తలేకపోయేడు.

"బాబూ, హోటేలు తలుపు మూసి వుంది. అయ్యరుబాబు ఏడకో లేచిపోయేడంట" అంటూ ఖాళీ క్యారేజీ పట్టుకు ద్వారందగ్గర నిలబడ్డాడు పనికుర్రాడు.

"హా! అయ్యరుబాబు! దొంగవెధవ...




'బ్రాంకైటిస్ మూలంగా
నా శ్వాసకోశాలలో
మంట పుట్టింది'
కాని పెప్స
శ్వాసబాధను, మంటను వెంటనే
నివారించినవి



పెప్స్ టేబ్లెట్లు గొంతు, రొమ్ము బాధోపశమన, నివారక పారములు కలవి, మీరు పెప్స్‌ను చప్పరించునపుడు ఈ పారములు ఆవిరి అయి, మీ శ్వాసద్వారా గొంతుక, శ్వాస మార్గంగుండా, శ్వాస కోశాలకు కొనిపోబడుతాయి. ఇలా అవి సరాసరి మిమ్ము బాధించే భాగాలను చేరుకుంటాయి అందుకే పెప్స్ అంతశక్తివంతమై, జగద్విఖ్యాతి గాంచినవి పెప్స్ దగ్గులను అణచివేస్తాయి, గొంతు పుండు బాధను ఉపశమింప జేస్తాయి, కఫమును కోసివేసి, శ్వాసబాధను పోగొట్టుతాయి. ఇన్‌ఫ్లుయేంజా, బ్రోంకైటిస్ చికిత్సకు ఇవి అమోఘమైనవి!

PEPS

పెప్స్ గొంతు, రొమ్ము టేబ్లెట్లు.
మందులమ్మేవారి అందరివద్దా లభిస్తాయి

మద్రాసు సోల్ ఏజెంట్లు: దాదా & కంపెనీ, పార్కు టౌన్, మద్రాసు 3.

నిన్ననే ఏభై రూపాయిలూ పెట్టి టిక్కెట్లు బుక్కు కొన్నది...సర్లే. ఇవన్నీ బాగున్నాయా; అది బాగులేదా? యీ డబ్బు పెట్టి మరో హోటల్లో భోజనం పట్రా. వచ్చేటప్పుడు డాక్టరుగార్ని కూడా పిల్చుకురా. మర్చిపోకేం?" అంటూ కుర్రాణ్ణి పంపి తనో సిగరెట్టు వెలిగించేడు.

పనిమనిషి సన్యాసమ్మ యిల్లు వూడుస్తూ "అయ్యగోరూ, యియ్యాల శంకరంబాబు ఆపడ్డారు బజార్లో" అంది.

"ఏమిటి విశేషాలు" అన్నట్టు చూసేడు, తనేమీ మాట్లాడకుండా రామం.

"అమ్మగోరూ, చినబుల్లెమ్మ కులాసా? అన్నాను. బుల్లెమ్మగోరు బాగున్నారంట కాని అమ్మగోరు మాత్రం ఓరోజు కోరోజు సిక్కి సగమైపోతన్నారంట. తిండి సరిగా తిన్రంట. ఎప్పుడూ దిగులుగా కూకుంటారంట" అని రామం ముఖం చూసింది. కళ్లమ్మటి నీళ్లు చిందుతున్నాయి. ముఖం పక్కకి తిప్పుకొని తువ్వాలుతో తుడుచుకున్నాడు.

"బాబూ తెలకడుగుతాను...మొగుడూ-పెళ్లాం - ఆళ్లిద్దరికీ కాపోతే యింకెవ్రొస్తాయి తగాదాలు? మామొగాడున్నాడే! ఆడి చేతులడ! రేత్తుర్లు తప్పతాగి వొళ్లంతా హూనంచేత్తాడు మా రాజా...ఆడే పెందలకాడ నెగిసి 'ఎర్రిసన్నాసి! ఎంత లేసి దెబ్బలేసేనే సచ్చినోణ్ణి!' అంటూ ఒళ్లంతా నిమురుతాడు." అని పమిటచాటులో చిరునవ్వు లోలకబోసుకుంది...

"రోజూ యిదే ఓలకం! అమాత్రం దానికే మే వేరింటికాపురం పెట్టేమా బాబూ? ఆడిజిమ్మడా! మీలాగ ఒదల్నేనా ఒదల్ను" అంది.

రామం మనసు కలుక్కుమన్నాది. దెబ్బ నసాళానికంటిపోయింది. కాని తమాయించుకొని పాలిపోతూన్న ముఖానికి తేలిపోతూన్న చిరునవ్వు అద్దుపెట్టుకొన్నాడు.

మంచంమీద అమ్మాజీ "అమ్మా...అమ్మకావాలి నాన్నా." అంటూ ఒరువుగా మూలుగుతూంది. ఏదో నిశ్చయాని కొచ్చినవాడిలాగా లేచి శశిని అమ్మాజీదగ్గర వుండమని చెప్పి బయలుదేరాడు. వీధుల్లో మెర్క్యురీ దీపాలు తన జీవితపు బాటల్లోకి వెలుగులు వెదజల్లుతూన్నట్టున్నాయి.

*    *    *

కొన్నాళ్ళ తరువాత...

"శశీ! పాపాయి గౌను విప్పెయ్యమ్మా. యిప్పటికే అరడజను గౌన్లు మైలెట్టింది" అంటూంది రాజ్యం వాకతూ వస్తున్న పాపాయిని ముట్టుకోవద్దని వారిస్తూ. లోపలినుంచి గబగబా రామం వచ్చి,

"ఇదుగో! నీకు విడాకు లిస్తా..."

"అయ్యో! మళ్ళీనా? 'నేనేం పాపం చేసేనండీ యిలా బాధలు పెట్టడానికి? మొగాళ్ళ మనసులు క్షణక్షణానికీ మారిపోతూ వుంటాయి అదేం ఖర్మమో...ఎంత చేతులు కాల్చుకున్నా యీ మూడురోజులే కదండీ" అంటూ మొదలెట్టింది.

"అయితే అక్కా క్షణక్షణముల్ జవరాండ్ర చిత్తముల్ అనేదానికి బదులు క్షణక్షణముల్ మొగవాండ్ర చిత్తముల్ అని మార్చాలంటావు" అన్నాడు శంకరం గదిలోంచి.

"తమ్ముడు చస్తావుంటే రెండో పెళ్లిట. ఏమిట్రా నీ కాకిగోల? వేళాకోళానికి హద్దూ పద్దూ లేకుండావుంది. వావి వరుస అక్కరలేదట్రా ఓమూల కొంపలంటుకుంటుంటే? మీబావ మళ్ళీ విడాకు లిస్తారుట..."

"ఆఁ! యీమాటు నీ కొక్కర్తికే కాదు. మీ యిద్దరికీ కలిపే యిస్తాను! నెల్రి మొహామా, ఏమిటా గయ్యాళితనం, చెప్పేది సాంతం వినకుండాను. నాకు విస్తర్లు కుట్టడం రాదు కాబట్టి నీకు విడాకులు- అంటే విడి - అడ్డాకులు యిస్తానూ..నువ్వు విస్తరి కుట్టుకొంటే అన్నం వడ్డించి ఆఫీసుకి పోతానూ...అంటున్నాను" అన్నాడు రామం.

"ఇవి అడ్డాకుల్లో విడాకులా!" అన్నాడు శంకరం పాప నెత్తుకుని రామాని కందిస్తూ. ★


విచిత్ర వ్యక్తి

మూలం: మార్క్ట్వేన్


అనువాదం: నండూరి రామమోహనరావు

వెల రూ. 1-8-0

పోష్టు ఖర్చులు ప్రత్యేకం

ఆంధ్ర గ్రంథమాల, ★ మద్రాసు-1.





236